సాక్షి
తూర్పుగోదావరి

శనివారం । 7 । జనవరి । 2023



వైభవంగా చండీ హోమం


పెద్దాపురం: పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

పీక నులిమి చంపేశారు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని నియోజకవర్గ కేంద్ర మైన మండపేటలో ఫొటోగ్రాఫ ర్‌ను పీక నులిమి చంపేశారు. నూతన సంవత్సర వేడుకల వేళ మండపేట బైపాస్ రోడ్డులోని ఒక లే అవుట్‌లో ఆ ఫొటోగ్రాఫర్ అనుమానాస్పద రీతిలో మృతి చెందిన విషయం తెలిసిందే. పోలీసులు కూడా అనుమానా స్పద మృతిగా కేసు నమోదు చేశారు. - IIలో▸

డెల్టాలకు నీరు విడుదల



రాజమహేంద్రవరం రూరల్: ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం డెల్టా కాలువలకు 8,970 క్యూసె క్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్యడెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 8.60 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

9న యథావిధిగా 'స్పందన'

కాకినాడ సిటీ: స్థానిక కలెక్టరేట్‌లో **సోమవారం** స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకరణ **కార్యక్రమం** యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ **కృతికా** శుక్లా శుక్రవారం ప్రకటనలో **పేర్కొన్నారు.** ఉదయం 9.30 గంటల నుంచి ఈ **కార్యక్రమం** జరుగుతుందని, అర్జీదారులు, జిల్లా **అధికారులు** గమనించాలని అన్నారు.

ఆసుపత్రుల్లో విజిలెన్స్ తనిఖీలు

రాజమహేంద్రవరం సిటీ: కమ్యూనిటీ **హెల్త్** సెంటర్లలో రోగులకు అందుతున్న సదు**పాయాలు,** మందుల లభ్యత, సిబ్బంది హాజరు, **ఆరోగ్య** కేంద్రాలలో మౌలిక వసతులు లాంటి **అంశాలపై** విజిలెన్స్ అధికారులు శుక్రవారం తని**ఖీలు నిర్వ** హించారు. తనిఖీలో గుర్తించిన అంశాలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీపీటీ రవి కుమార్ తెలిపారు. మూడు బృందాలుగా ఏర్పడి గోపాలపురం మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కాండ్రకోటలోని పీహెచ్‌సీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలంలోని ఊబలంక పీహెచ్‌సీలను ఆకస్మిక తనిఖీ చేసినట్లు తెలిపారు. డీఎస్పీ ముత్యాలనాయుడు, కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు సత్యకిషోర్, రమేష్, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, ఫారెస్ట్ రేంజ్ అధికారి వలి, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ తదితరులు తనిఖీలో పాల్గొన్నారు.

న్యాయ సేవలను వినియోగించుకోవాలి

ప్రకాశం నగర్(రాజమహేంద్రవరం సిటీ): జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ప్రజలు వినియోగించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్ తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రాంగణంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు పి.వెంకట జ్యోతిర్మయి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ ప్రీ అరెస్ట్, అరెస్ట్, రిమాండ్, ట్రయల్, అప్పీలు, ఇతర క్రిమినల్ పిటిషన్లు ఏ దశలో ఉన్నా ఉచిత న్యాయ సేవలు అందిస్తారన్నారు. వారి తరఫున వాదించేందుకు న్యాయవాదిని నియమిస్తామన్నారు. అవసరమైనవారు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ 0883-2941047, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ 0883 2470185, 94409 01047ను సంప్రదించాలన్నారు.


2 నుంచి 'నన్నయ'లో జాతీయ సదస్సు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 'ప్రాచీన తెలుగు సాహిత్యం, చారిత్రక, సామాజిక, సాంస్కృతిక దృక్పథాలు' అనే అంశంపై ఫిబ్రవరి 2 నుంచి 4 వరకు జాతీయ సదస్సు జరగనుంది. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను వర్సిటీ వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. యూనివర్సిటీలోని తెలుగు శాఖ, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం (నెల్లూరు), భారతీయ భాషా సంస్థ (మైసూర్), విద్యామంత్రిత్వ శాఖ, కేంద్ర ఉన్నత విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ సదస్సు జరుగుతుందన్నారు. సంచాలకులుగా మాడభూషి సంపత్ కుమార్, ఆచార్య సీవీ శివరామకృష్ణ, కన్వీనర్‌గా డాక్టర్ తరపట్ల సత్యనారాయణ వ్యవహరిస్తారన్నారు.

ప్రణాళిక ప్రకారం లక్ష్యాలను సాధించాలి

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జగనన్న తోడు, వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా, హౌసింగ్ రుణాల పంపిణీపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక ప్రకారం లక్ష్యాలను సాధించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై డీఆర్డీఏ, పశుసంవర్ధక శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో 23,504 మందికి ఇళ్ల నిర్మాణం కోసం అదనపు రుణాలను అందజేశామన్నారు. జగనన్న తోడు కింద 5,613 మందికి రూ.5.61 కోట్లు పంపిణీ చేశామన్నారు. వైఎస్సార్ కల్యాణమస్తుకు 1,723 మంది దరఖాస్తు చేసుకోగా, వాటిని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్క్రూటినీ చేయాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఎస్.సుభాషిణి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎస్‌జీటీ సత్య గోవింద్ పాల్గొన్నారు.

గోదావరిలో దూకిన యువకుడు



సాయిప్రసాద్ (ఫైల్)

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెన పైనుంచి గోదావరిలో దూకి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా పోలవరం మండలం కొత్త పట్టిసీమ గ్రామానికి చెందిన ఎస్పీ సాయిప్రసాద్ పట్టణంలోని ఏబీఎన్ అండ్ పీఆర్‌ఆర్ కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అతడు శుక్రవారం సాయంత్రం బుల్లెట్ మోటార్ సైకిల్‌పై రోడ్డు కం రైలు వంతెన పైకి వెళ్లాడు. తన బైక్‌ను 132వ స్తంభం వద్ద నిలిపి, నదిలో దూకినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. కళాశాల గుర్తింపు కార్డు, ఫొటో ఆధారంగా అతడిని సాయిప్రసాద్‌గా గుర్తించారు.

అనగనగనగా..

- మసకబారుతున్న 'స్వర్ణ'కారుల బతుకులు
- కార్పొరేట్ తాకిడికి దూరమవుతున్న ఉపాధి
- ప్రత్యామ్నాయంతో పట్టణాలకు వలస



(డెస్క్–రాజమహేంద్రవరం)

ఆధునిక పరిస్థితుల ప్రభావితంతో కుల వృత్తులు కూలిపోతున్నాయి. రోజురోజుకూ ఉనికి కోల్పోతున్నాయి. మనుగడ కష్టమని భావించిన కొందరు బతుకుదారి మార్చుకుంటున్నారు. మరికొందరు ఇప్పటికీ తాతల కాలం నుంచి వారసత్వంగా అబ్బిన వృత్తినే నమ్ముకుంటూ యాతనలు పడుతున్నారు. ఒకప్పుడు 'బంగారు'బాబుల్లా బతికిన స్వర్ణకారుల పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది. చాలామంది పల్లెటూళ్ల నుంచి పట్టణాల బాట పడుతున్నారు. బతుకు బండి పయనానికి ప్రత్యామ్నాయ దారులు వెతుక్కుంటున్నారు.

ఉనికిపాట్లు

కార్పొరేట్ సంస్థల సవాళ్ల నేపథ్యంలో కూడా ఉమ్మడి గోదావరి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో స్వర్ణకారులు ఇప్పటికీ ఉనికి చాటుతున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలోని నల్లమందుసందు, సీతమ్మసందు, చందాసత్రం, గుండువారి వీధి ప్రాంతాల్లో కొందరు స్వర్ణకారులు కొద్దోగొప్పో ఆభరణాల తయారీ పనులు చేసుకుంటూ వృత్తికి ఊపిరిలూదుతున్నారు. దీర్ఘకాలంగా ఉన్న పరిచయాలతో కొందరు ఇక్కడకు వచ్చి బంగారమిచ్చి వారితో ఆభరణాలు తయారు చేయించుకుంటున్నారు. ఒక్క రాజమహేంద్రవరం నగరంలోనే 2008 నాటికి వెయ్యి మందికి పైగా స్వర్ణకారులు ఉండేవారు. ఇప్పుడు వీరి సంఖ్య బాగా తగ్గిపోయింది. తమ సంఘంలో 600 మంది సభ్యులుగా కొనసాగుతున్నారని రాజమహేంద్రవరం స్వర్ణకారుల సంఘం గండేబత్తుల శ్యామ్ చెప్పారు.

కార్పొరేట్ సెగ

ఆభరణాల రంగంలో కార్పొరేట్లు అడుగు పెట్టడంతో స్వర్ణకారుల బతుకులు రంగు మారిపోయాయి. అప్పటి వరకూ ఉన్న ఉపాధి కాస్తా దూరం కావడం ప్రారంభమైంది. తొలినాళ్లలో జ్యూయలరీ షాపులొచ్చి వీరి మనుగడను కొంత దెబ్బ తీశాయి. పాతిక సంవత్సరాలుగా నగరాల్లో కార్పొరేట్ షాపులు పెరిగిపోయాయి. ఈ పదేళ్లలో ఓ మాదిరి పట్టణాలకూ ఈ షాపులు విస్తరించాయి. పగలూ రాత్రీ విద్యుద్దీపాల కాంతులతో వెలిగిపోయే అందాల షాపుల భవంతుల వైపే జనమూ అడుగులు వేస్తున్నారు. ఫలితంగా వృత్తి నైపుణ్యమున్న స్వర్ణకారులకు ఆదరణ తగ్గింది. కార్పొరేట్ తాకిడికి తలవంచిన కొందరు బ్యాంకులు లేదా బంగారంపై వడ్డీ ఇచ్చే వ్యక్తుల వద్ద అప్రైజర్లుగా చేరిపోయారు. వయసు 50లు దాటిన మరికొందరు మరో పని నేర్చుకోలేక తప్పనిసరి పరిస్థితుల్లో పాత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం స్వర్ణకారులుగా పని చేస్తున్నవారెవరూ తమ పిల్లలను ఈ రంగం వైపు నడిపించడంలేదు. తన ఇద్దరు పిల్లలూ బాగా చదువుకున్నారని.. ఒకరు ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారని నల్లమందు సందులో పని చేస్తున్న స్వర్ణకార సంఘం సభ్యుడు పేరూరి సూర్య ప్రకాష్ చెప్పారు. తమ తరం తర్వాత స్వర్ణకారులు కనిపించరని ఆవేదన వ్యక్తం చేశారు.

పోటీ పడదామన్నా పెట్టుబడి ఏదీ..

అన్ని వృత్తుల మాదిరిగానే ఆభరణాల తయారీలో కూడా ఆధునికత అడుగు పెట్టింది. ప్రతి చిన్న పనీ యంత్రాల సాయంతోనే చేయాల్సి వస్తోంది. కానీ వాటిని సమకూర్చలేక స్థాయికి తగ్గట్టుగా చిన్నపాటి పరికరాలతో స్వర్ణకారులు నెట్టుకొస్తున్నారు. గతంలో ఎక్కువగా కుంపటి ఉపయోగించేవారు. నాటి స్వర్ణకారులెందరినో శ్వాసకోశ వ్యాధులు ఇప్పటికీ వెంటాడుతున్నాయని స్వర్ణకారుడు ఈదరాడ శ్రీనివాస్ చెప్పారు. ఉదయం నుంచి చీకటి పడే వరకూ కూర్చుని పని చేయడం వల్ల శారీరక వ్యాయామం లేక అనారోగ్యం బారిన పడుతున్నామని మరో స్వర్ణకారుడు ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దోగొప్పో డబ్బులు వెచ్చించి, చిన్నపాటి యంత్రాలు కొందామన్నా ఎక్కువ మందికి ఆర్థిక పరిస్థితులు అనుకూలించడం లేదు. ఒక్కో యంత్రానికి కనీసం రూ.50 వేల పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. వ్యక్తిగత రుణాలకు బ్యాంకులు సహకరించడ లేదని స్వర్ణకారుడు వరప్రసాద్ చెప్పారు. దొంగ బంగారం కొన్నారంటూ గతంలో పోలీసుల నుంచి తమకు తరచూ వేధింపులు ఎదురయ్యేవని కొందరు స్వర్ణకారులు చెప్పారు. ఐదేళ్లుగా ఈ వేధింపులు తగ్గాయన్నారు. ఏమైనప్పటికీ కార్పొరేట్ సంస్థల పోటీని తట్టుకోలేక స్వర్ణకారుల బతుకులు కాంతిహీనమవుతున్నాయి.



సామాజిక భవనమూ లేదు



ఈ మధ్యనే రాజమహేంద్రవరం స్వర్ణకారుల సంఘానికి ఏకగ్రీవంగా అధ్యక్షునిగా ఎన్నికయ్యాను. స్వర్ణకారుల బతుకులు దయనీయంగా ఉన్నాయి. ఈ నగరంలో మాకు ఒక సామాజిక భవనం కూడా లేదు. స్థలమివ్వగలిగితే భవనం ఇస్తామని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఖరీదైన స్థలాన్ని కొనుగోలు చేసి సమకూర్చగలిగే ఆర్థిక స్తోమత మాలో ఎవ్వరికీ లేదు. ప్రజాప్రతినిధులు మా కష్టాలను గమనించి సామాజిక భవనం నిర్మించాలని కోరుతున్నాను.

- గండేబత్తుల శ్యామ్, అధ్యక్షుడు, రాజమహేంద్రవరం స్వర్ణకారుల సంఘం

రుణం అందించాలి



స్వర్ణాభరణాల తయారీ యంత్రాలు చాలా ఖరీదైనవి. కొనుక్కుని బతుకుదామంటే ఆర్థిక పరిస్థితులు సహకరించడం లేదు. ముద్రా రుణాలు మంజూరు చేయాలని కోరుతున్నా బ్యాంకులు స్పందించడం లేదు. పూచీకత్తు లేనిదే ఇవ్వబోమంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ వృత్తిలో ఎలా పోటీ పడగలం? ఎలా ముందుకు వెళ్లగలం? రుణ సదుపాయం కల్పిస్తే కొద్దోగొప్పో ఈ వృత్తి బతకడానికి అవకాశముంటుంది.

- ఈదర వరప్రసాద్, నల్లమందు సందు, రాజమహేంద్రవరం

ఈ స్పీడులో మాలాంటి వాళ్లకు కష్టమే..



ఎక్కడ పడితే అక్కడ జ్యూయలరీ షాపులు వచ్చేశాయి. పెద్ద పట్టణాల్లో కార్పొరేట్ సంస్థల షోరూములు వచ్చేశాయి. అక్కడ అడిగిన వెంటనే కావాల్సిన నగ దొరుకుతోంది. ప్రస్తుతం ప్రజలకు అడిగిన వెంటనే సరకు ఇవ్వాలి. ఒక్క క్షణం కూడా ఓపిక పట్టే తత్వం పోయింది. ఇలాంటి పరిస్థితుల్లో మేం ఎంత బాగా చేసినా ఫలితం ఏముంది? కొద్ది మంది మాత్రం చిన్నచిన్న నగలు చేయించుకోవడానికి నమ్మకంతో వస్తున్నారు. జగన్ ప్రభుత్వం పుణ్యమాని పెన్షన్ వస్తోంది.

- నామగిరి బ్రహ్మానందం, ప్రత్తిపాడు

అర్బన్ ఫుడ్ ప్లాజా ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం ప్రజలకు కొత్త కల్చర్‌లో భాగంగా అర్బన్ ఫుడ్ ప్లాజాను పరిచయం చేస్తున్నామని ఎంపీ మార్గాని భరత్‌రామ్ చెప్పారు. శుక్రవారం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వద్ద నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 33 షాపుల సముదాయాన్ని కలెక్టర్ మాధవీలత, ,రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, జేసీ తేజ్ భరత్, కమిషనర్ దినేష్ కుమార్‌లతో కలసి ఆయన ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ అర్బన్ ఫుడ్ ప్లాజాలో వాహనాలకు ప్రవేశం లేదన్నారు. సరదాగా కుటుంబ సభ్యులతో నడచివచ్చి ఆస్వాదించేలా రూపొందించామన్నారు. ప్రస్తుతానికి 33 స్టాళ్లకు అనుమతి ఇచ్చామన్నారు. మరో 30 షాపులు వచ్చే అవకాశాలున్నాయన్నారు. పుష్కర ఘాట్, ఏకేసీ కళాశాల సమీపంలో కూడా ఇలాంటివి ఏర్పాటు చేయనున్నామన్నారు. ప్రజావసరాలను బట్టి మరో రెండు మూడు గంటలు పెంచాలని యోచిస్తున్నామన్నారు. రాత్రి సమయంలో ఇక్కడకు వచ్చేవారికి ఎటువంటి ఇబ్బందీ కలగకుండా పోలీసు నిఘా ఉంటుందన్నారు. ఆకతాయిలు, మద్యం సేవించే వారు వస్తే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి ఫుడ్ కోర్టు ద్వారా సరికొత్త కళ వచ్చిందన్నారు. సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు స్టాల్స్ అందుబాటులో ఉంటాయన్నారు. నగరంలో మరిన్ని ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాలిక శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అర్బన్ ఫుడ్ ప్లాజాలో సరదాగా నూడిల్స్ చేస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎంపీ భరత్ రామ్, చిత్రంలో మేడపాటి షర్మిలారెడ్డి, జేసీ తేజ్ భరత్, కమిషనర్ దినేష్‌కుమార్

రేపు గ్రూప్ వన్ ప్రిలిమినరీ పరీక్ష

- జిల్లాలోని 23 కేంద్రాల ఏర్పాటు
- డీఆర్‌ఓ నరసింహులు

సీటీఆర్‌ఐ(రాజమహేంద్రవరం): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే గ్రూప్ వన్ ప్రిలిమినరీ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌వో) జి.నరసింహులు అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ జిల్లాలోని 23 పరీక్షా కేంద్రాల్లో 7,946 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తారన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకూ పేపరు -1, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 వరకు పేపరు -2 పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం జరిగే పరీక్షకు 9.45 గంటల లోపు, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 1.45 గంటల లోపు అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి హాజరు కావాలన్నారు. హాల్ టికెట్లతో పాటు ప్రభుత్వం గుర్తించిన ఏదైనా ఒక ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలన్నారు. సర్వీసు కమిషన్ అసిస్టెంట్ సెక్రటరీ కె.శారద మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు సంబంధించి సర్వీస్ కమిషన్ సూచించిన మార్గదర్శకాలను లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు ఒకటికి రెండుసార్లు పూర్తి పరిశీలన చేయాలన్నారు. అదనపు ఎస్పీ జీవీ రావు మాట్లాడుతూ పరీక్షా కేంద్రం సమీపంలో జిరాక్స్, ఆన్‌లైన్ కేంద్రాలను మూసివేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో 144వ సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. సమావేశంలో సర్వీస్ కమిషన్ అధికారి డి.మల్లికార్జునరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ డి.రామవర్మ, ఎంహెచ్‌ఓ డాక్టర్ వినూత్న, ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ అజయ్ బాబు, రాజమహేంద్రవరం రూరల్ తహసీల్దార్ ఎస్ఎస్ పవన్ కుమార్, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎన్.వసుంధర, డీఆర్‌డీఏ పీడీ ఎస్.సుభాషిణి పాల్గొన్నారు.

దయ చూపని 'వివేకానంద'

- ప్రభుత్వ ఉత్తర్వులను పట్టించుకోని యాజమాన్యం
- రిటైరైన ఎయిడెడ్ స్కూలు టీచరు ఆవేదన



స్కూలు వద్ద గత ఆరు రోజులుగా నిరీక్షిస్తున్న టీచర్ సుగుణకుమారి

నల్లజర్ల: దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించడం లేదనడానికి ఇదొక ఉదాహరణ. 1987లో మండలంలోని పోతవరం గ్రామంలోని వివేకానంద ఎయిడెడ్ స్కూల్లో కొండ్రెడ్డి సుగుణకుమారి టీచరుగా చేరారు. ఆమెకు 60 ఏళ్లు నిండడంతో గతేడాది జూన్ 30న రిటైరయ్యారు. ఉపాధ్యాయుల సర్వీసును 62 ఏళ్లకు పెంచుతూ అదే ఏడాది జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ఎయిడెడ్ స్కూల్ టీచర్లకు మాత్రం ఆ జీఓ గతేడాది నవంబర్ 29న విడుదల చేశారు. ఉత్తర్వులు డిసెంబర్ 16న బయటకు వచ్చాయి. ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్ని యాజమాన్యాలు ఈ జీఓను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాల మేరకు అప్పుడే రిటైరైన ఎయిడెడ్ స్కూల్ టీచర్లందరూ యథావిధిగా స్కూల్లో చేరిపోయారు. పోతవరం వివేకానంద స్కూల్ యాజమాన్యం మాత్రం సుగుణకుమారిని చేర్చుకోవడానికి నిరాకరిస్తోంది. ఈ స్కూల్లో 117 మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారు.

తప్పనిసరిగా చేర్చుకోవాలి

దీనిపై నల్లజర్ల ఎంఈఓ శ్రీనివాసరావును 'సాక్షి' వివరణ కోరింది. సుగుణకుమారిని తప్పనిసరిగా జాయిన్ చేసుకోవాలంటూ యాజమాన్యానికి లిఖిత పూర్వకంగా ఉత్తర్వులు కూడా ఇచ్చామన్నారు. వాటిని యాజమాన్యం అమలు చేయకపోవడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాని చెప్పారు. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. దీనిపై వివేకానంద ఎయిడెడ్ స్కూల్ చైర్మన్ ప్రత్తిపాటి వెంకటరత్నంను 'సాక్షి' వివరణ కోరగా ఈ టీచర్ సుగుణకుమారికి ఫిట్‌నెస్ సరిగా లేదన్నారు. సర్వీసు పొడిగింపు కోరుతూ ఆమె కోర్టుకు వెళ్లారన్నారు. ఆ విషయం తేలాకే చేర్చుకుంటామని చెప్పారు. ఆమెను ఏవిధంగా చేర్చుకోమంటారో తెలియజేయాలంటూ జిల్లా విద్యాశాఖాధికారికి తాము లేఖ రాశామన్నారు. టీచరు సుగుణమ్మ మాత్రం రోజూ స్కూల్‌కు వెళ్లి స్కూల్ మూసే వరకూ అక్కడే ఉంటున్నారు.

యానాం మద్యం స్వాధీనం

ముగ్గురిపై కేసు నమోదు



నిందితులు, స్వాధీనం చేస్తున్న మద్యం సీసాలతో జిల్లా ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ పిట్టా సోమశేఖర్

రాజమహేంద్రవరం రూరల్: యానాం నుంచి తూర్పుగోదావరి జిల్లాకు అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్న ముగ్గురిని శుక్రవారం అరెస్టు చేశారు. రూ.1.75 లక్షల విలువైన 768 మద్యం బాటిళ్లు, రెండుకార్లను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ సోమశేఖర్ మీడియాకు తెలిపారు. బ్రాందీ షాపు యజమానితోపాటు, బాటిళ్లు కొనుగోలు చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేస్తున్నామన్నారు. శుక్రవారం దివాన్‌చెరువులో ఆగి ఉన్న రెండుకార్ల తనిఖీ చేయగా ఈ మద్యం గుట్టు రట్టయిందన్నారు. యానాంకు చెందిన దువ్వారపు శివప్రసాద్, రేవు వెంకట మీరయ్య, రొప్పిశెట్టి శివలను అరెస్టు చేశామన్నారు. శివప్రసాద్ యానాంలోని శ్రీలక్ష్మీ వైన్స్‌లో గుమస్తాగా పనిచేస్తూ కాకినాడ, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు మద్యం సరఫరా చేస్తున్నట్లు తేలిందన్నారు. మీడియా సమావేశంలో ఎస్ఈబీ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రాంబాబు, సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ, సివిల్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, టెక్నికల్ ఎస్సై నాగేశ్వరరావు, సౌత్‌ఎస్సై చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందేలపై కఠిన చర్యలు

- కలెక్టర్ మాధవీలత వెల్లడి
- అధికారులతో సమీక్ష

సీటీఆర్‌ఐ(రాజమహేంద్రవరం): సంక్రాంతి సందర్భంగా జూద క్రీడలు, కోడిపందేలపై నిషేధం ఉందని కలెక్టర్ మాధవీలత శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి 22 అంశాలతో కూడిన మార్గదర్శకాలను జారీ చేశారు. పొలాల్లోనూ, బహిరంగ ప్రదేశాల్లోనే కాకుండా మరే ప్రాంతంలోనూ కోడిపందేల నిర్వహణకు అనుమతి లేదన్నారు. ఈ విషయంలో ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. దీనిపై కోర్టు స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. దీని అమలుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలన్నారు. పోలీసులు, రెవెన్యూ సంబంధిత సమన్వయ శాఖ అధికారులు దృష్టి సారించాలన్నారు. సమాచారం అందితే విస్తృత దాడులు కేసు నమోదు చేయాలన్నారు. పందేలు నిర్వహించే, పాల్గొనే వారిపై జంతు హింస చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు.

జూదాలకు స్థలాలు ఇస్తే కేసులు

పందేలకు లేదా జూద క్రీడలకు స్థలాలు ఇచ్చే యజమానులపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుము వసూలు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. వీటికి సంబంధించిన ఫొటోలు.. వీడియో ఆధారాలను సేకరించాలని అధికారులకు సూచించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు సంక్రాంతి సందర్భంగా కల్తీ మద్యం విక్రయాలను నిరోధించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 7 నుంచి 25 వరకు సమన్వయ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి జనవరి 25 తదుపరి నివేదిక సమర్పించాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్

పౌష్టికాహారలోపం లేని జిల్లాగా తీర్చిదిద్దాలి

రక్త హీనత, పౌష్టికాహార లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దడంలో ఐసీడీఎస్, వైద్య, ఆరోగ్య, విద్య తదితర శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ మాధవీలత పిలుపునిచ్చారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్డీజీ)పై జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్‌తో కలసి శుక్రవారం కలెక్టరేట్ ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రతి 15 రోజులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన కార్యదర్శి సమీక్షిస్తున్నారన్నారు. జిల్లాలోని కిశోర బాలికలు, గర్భిణులు, చిన్న పిల్లలకు రక్త హీనత రాకుండా పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రతి పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అధికారులు ప్రతి గురువారం సమావేశాలు నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో లోపాలను గుర్తించి, వాస్తవ నివేదికలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు రక్తహీనతపై అవగాహన కల్పించాలన్నారు. డ్వాక్రా మహిళలతో ఇంటింటి ప్రచారం చేయడం, స్కూళ్లలో వివిధ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనధికార క్వారీల నిర్వహణపై సర్వే

రౌతులపూడి: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న అనధికార క్వారీల నిర్వహణపై అధికారుల బృందం శుక్రవారం సర్వే చేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ఎస్.పైడిపాల, తిరుపతమ్మపేట, ఉప్పంపాలెం, ములగపూడి తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న నల్లరాయి క్వారీలపై మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారుల బృందం సమగ్ర సర్వే చేసింది. సర్వేలో భాగంగా పలు అక్రమ క్వారీలను గుర్తించినట్టు అధికారులు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా క్వారీల నిర్వహణ, బ్లాస్టింగ్, రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తుని రూరల్ సీఐ సన్యాసిరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.విష్ణువర్ధనరావు, ఏజీ శ్రీనివాసరావు, వీఆర్వో షేక్ బాబ్జీ, సర్వేయర్ గోవిందు పాల్గొన్నారు.

‘నన్నయ’లో కూచిపూడి నృత్యం కోర్సు



కోర్సు కో ఆర్డినేటర్ శ్రీరాజరాజేశ్వరీదేవికి ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ జగన్నాథరావు

రాజానగరం: ఆసక్తి ఉన్న మహిళల కోసం కూచిపూడి నృత్యంలో పార్ట్ టైమ్ డిప్లొమా కోర్సు ప్రవేశపెడుతున్నామని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎం.జగన్నాథరావు తెలిపారు. ఈ కోర్సు కో ఆర్డినేటర్‌గా డాక్టర్ కె.శ్రీరాజరాజేశ్వరీదేవిని నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. వర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్‌లో ప్రదర్శన కళల విభాగం, నన్నయ భారతి, నన్నయ అధ్యయన కేంద్రాల ద్వారా ఈ కోర్సు ప్రారంభిస్తున్నామన్నారు. ఇందులో చేరాలనుకునే మహిళలు ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ లేదా 99126 62500 నంబర్‌లో సంప్రదించాలని వీసీ సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓఎస్‌డీ ఆచార్య ఎస్.టేకి పాల్గొన్నారు.

● రహదారిపై యుద్ధ ట్యాంకులు



దేశ భద్రత కోసం ఆర్మీ జవానులు వినియోగించే యుద్ధ ట్యాంకులు కాకినాడ జిల్లా బెండపూడి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం కనువిందు చేశాయి. మూడు యుద్ధ ట్యాంకులను ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్ నుంచి విశాఖకు తరలిస్తున్నామని సైనికాధికారులు తెలిపారు. ఆ ట్యాంకులను తరలిస్తున్న వాహనానికి సాంకేతిక సమస్య తలెత్తడంతో బెండపూడి శివారున కొన్ని గంటల పాటు నిలిపివేశారు. జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులు వీటిని ఆసక్తిగా తిలకించారు. వాహన మరమ్మతుల అనంతరం యుద్ధ ట్యాంకులను విశాఖకు తరలించారు. - తొండంగి

● అమ్మను అభిషేకించాలని..



అనపర్తి గ్రామ దేవత శ్రీ వీరుళ్ళమ్మ అమ్మవారికి సుమారు వెయ్యి మంది ముత్తయిదువలు శుక్రవారం హరిద్రాభిషేకం నిర్వహించారు. ఈ నెల 14వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు అమ్మవారి జాతర జరగనుంది. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీ ఆధ్వర్యాన హరిద్రాభిషేకం సంప్రదాయబద్ధంగా, వైభవంగా నిర్వహించారు. స్థానిక ఎర్రకాలువ నుంచి మహిళలు బిందెలతో గోదావరి జలాలను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం పసుపు, పుష్పాలు కలిపి వీరుళ్ళమ్మవారి మూలవిరాట్‌ను అభిషేకించారు. - అనపర్తి

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు నేటితో గడువు పూర్తి

రాయవరం: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్ సొసైటీ) ఆధ్వర్యంలో నిర్వహించే అడ్మిషన్లకు శనివారంతో గడువు ముగియనుంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో అడ్మిషన్లకు తత్కాల్ ప్రాతిపదికన మరో అవకాశం ఇచ్చారు. గత ఏడాది ఆగస్టులో నోటిఫికేషన్ వెలువడగా, డిసెంబర్ 16తో గడువు ముగిసింది. అయితే ఇప్పటికే అడ్మిషన్ పొందలేని వారికి ఓపెన్ స్కూల్ డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి మరో అవకాశం కల్పించారు. అలాగే అడ్మిషన్ ఫీజు చెల్లింపునకు 8వ తేదీ వరకూ గడువు ఇచ్చారు. పదో తరగతికి అపరాధ రుసుం రూ.400, ఇంటర్‌కు రూ.500 ఉంటుందన్నారు. అపరాధ రుసుంతో ఓపెన్ స్కూల్ ప్రవేశాలు ఈ నెల 8వ తేదీ వరకూ ఉన్న విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ ధ్రువీకరించారు. వివరాలకు ఓపెన్ స్కూల్ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ పి.సాయి వెంకట రమణను 8977 645 704 నంబరులో సంప్రదించాలని డీఈఓ సూచించారు.

మిక్సీ తీయబోతే కాటేసిన పాము

జగ్గంపేట: మిక్సీ తీసేందుకు ప్రయత్నించిన ఓ మహిళ పాముకాటుకు గురైంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గండేపల్లి మండలం యర్రంపాలేనికి చెందిన మహిళ సిత్తారపు సత్యవతి శుక్రవారం ఇంట్లో టిఫిన్ చెట్నీ చేసేందుకు అట్టపెట్టెలో ఉన్న మిక్సీ తీసేందుకు ప్రయత్నించింది. అప్పటికే ఓ తాచుపాము ఆ పెట్టెలోకి దూరి ఉంది. మిక్సీ తీసేందుకు ప్రయత్నించిన సత్యవతిని ఆ పాము ఒక్కసారిగా కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు సత్యవతిని వెంటనే జగ్గంపేట మండలం కాట్రావులపల్లి పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు రాజశేఖర్, విజయకృష్ణ వెంటనే స్పందించి మెరుగైన వైద్యం అందించడంతో ఆమెకు ప్రాణాపాయం తప్పింది. అనంతరం ఆమెను మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పామును స్థానికులు కొట్టి చంపేశారు.

సేవలకు చిరునామాగా స్వర్ణాంధ్ర

- అభినందించిన పలువురు నేతలు
- మరో రెండు వృద్ధాశ్రమాల ఏర్పాటు
- నిర్వాహకుడు గుబ్బల రాంబాబు వెల్లడి



వృద్ధురాలికి వస్త్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: నిరంతర స్వచ్ఛంద సేవలకు స్వర్ణాంధ్ర సేవాసంస్థ చిరునామాగా నిలుస్తుందని పలువురు వక్తలు కొనియాడారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం లాలాచెరువులో 1998లో ప్రారంభమై, శుక్రవారానికి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈ సంస్థ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా జరుపుకొంది. వేడుకలో దాతలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు సారథ్యంలో ఎంతోమందికి ఆశ్రయం కల్పిస్తూ, అన్నార్తులను ఆదుకుంటూ నిర్వహిస్తున్న కార్యక్రమాలతో రజతోత్సవం జరుపుకోవడం అభినందనీయమని వక్తలు కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేయడానికి తమ వంతు సహాయం అందిస్తామని ప్రకటించారు. రాంబాబు మంచి ఆలోచనతో చిన్న సంస్థగా ఆవిర్భవించిన ‘స్వర్ణాంధ్ర’ నేడు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అన్నార్తులను, వృద్ధులను ఆదుకుంటూ పాతికేళ్ల ప్రస్థానం సాగించడం సాధారణ విషయం కాదన్నారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర సేవాసంస్థకు సహకరించిన వారిని ఘనంగా సత్కరించారు. పేదలకు వస్త్రాలు పంచిపెట్టారు. సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు మాట్లాడుతూ మిత్రులు, దాతల సహకారంతో సంస్థ నడుస్తోందని అన్నారు. పెరుగుతున్న అవసరాలు, వృద్ధుల పట్ల చిన్నచూపు నేపథ్యంలో పేమెంట్ పద్ధతిలో రెండు వృద్ధాశ్రమాల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. ఉండవల్లి అరుణ్‌కుమార్ వంటి పెద్దల సౌజన్యంతో 40 మందికి ఆశ్రయం కల్పించేలా పేమెంట్ పద్ధతిలో త్వరలో ఒక ఆశ్రమం ప్రారంభించనున్నామని చెప్పారు. ఇప్పటివరకూ మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్ వంటి కోర్సులలో శిక్షణ ఇస్తున్నామన్నారు. కొత్త వృద్ధాశ్రమంలో కూడా వివిధ వృత్తుల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, సీపీ రెడ్డి మోటార్స్ అధినేత చింతా ప్రసాదరెడ్డి, జనసేన నగర ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ, వర్తక ప్రముఖులు అశోక్‌కుమార్‌జైన్, లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరావు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్‌ఏ-1 పరీక్షలు

రాయవరం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఇంగ్లిషు పరీక్ష నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలకు ఎస్‌ఏ-1 పరీక్షలు శనివారంతో ముగియనున్నాయి. 6-10 తరగతులకు ఈ నెల 10వ తేదీతో పరీక్షలు ముగియనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలల్లో 7.42 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు.

టెన్నికాయిట్ క్రీడాకారులకు శిక్షణ

మండపేట: పూర్వపు ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన టెన్నికాయిట్ క్రీడాకారుల శిక్షణ శుక్రవారం మండపేటలో ప్రారంభమైంది. గత ఏడాది నవంబర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరిగిన అండర్-14 టెన్నికాయిట్ పోటీల్లో ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఐదుగురు బాలురు, ఐదుగురు బాలికలు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరికి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఐదు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు మండపేట టెన్నికాయిట్ క్లబ్ ఆర్గనైజర్, కోచ్ కుంచె రమేష్ తెలిపారు. విశాఖపట్నంలో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు 21వ తేదీ నుంచి విశాఖపట్నంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ట్రెజరర్ కె.రామకృష్ణ, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీక నులిమి చంపేశారు

- ఫొటోగ్రాఫర్ హత్య వెనుక ‘దేశం’ నేత హస్తం
- పరారీలో ప్రధాన అనుచరుడు
- రెండు ప్రత్యేక బృందాలతో గాలింపు
- హత్య కేసుగా నమోదు



మృతుడు కొనిజాల సురేష్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కాకినాడ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని నియోజకవర్గ కేంద్రమైన మండపేటలో ఫొటోగ్రాఫర్‌ను పీక నులిమి చంపేశారు. నూతన సంవత్సర వేడుకల వేళ మండపేట బైపాస్ రోడ్డులోని ఒక లే అవుట్‌లో ఆ ఫొటోగ్రాఫర్ అనుమానాస్పద రీతిలో మృతి చెందిన విషయం తెలిసిందే. పోలీసులు కూడా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. తీరా తీగ లాగితే డొంక కదిలింది. అనుమానితులను పోలీసులు తమదైన శైలిలో విచారించారు. పోస్టుమార్టం నివేదికలో ఫొటోగ్రాఫర్‌ను హత్య చేసినట్టుగా నిర్ధారించారు. ఈ హత్య వెనుక పట్టణంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక మాజీ ప్రజాప్రతినిధి హస్తం ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసులో కీలక నిందితునిగా ఉన్న అతడి అనుచరుడు పరారీలో ఉండటం ఇందుకు బలం చేకూరుస్తోంది. అసలు ఈ హత్యకు, ఆ మాజీ ప్రజాప్రతినిధికి మధ్య సంబంధం ఏమిటి, హత్య చేయాల్సిన అవసరం ఏమొచ్చిందనే కోణంలో పోలీసు దర్యాప్తు సాగుతోంది.

మండపేటకు చెందిన ఫొటోగ్రాఫర్ కొనిజాల సురేష్ (28) డిసెంబర్ 31వ తేదీ రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనేందుకు స్నేహితులతో కలిసి వెళ్లి శవమై తేలాడు. తొలుత పట్టణ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహంపై ఉన్న గాయాల ఆధారంగా నాలుగు రోజులుగా వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మండపేట బైపాస్ రోడ్డులోని ఓ లే అవుట్‌లో ఆ రోజు నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ఇందులో పట్టణ టీడీపీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధి కారు డ్రైవర్‌తో కలిసి సురేష్ పాల్గొన్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆ డ్రైవర్‌తో పాటు మరికొందరిని తమదైన శైలిలో విచారించి, సురేష్ హత్యకు గురైనట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈ హత్యతో సంబంధం ఉన్న మరికొందరు అనుమానితుల పేర్లను సేకరించారు. వారిలో సదరు మాజీ ప్రజాప్రతినిధి ప్రధాన అనురుడు కూడా ఉన్నాడని నిర్ధారించుకున్నారు. అతడితో పాటు మరికొందరు పరారీలో ఉండటంతో వారి కోసం రెండు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

హతుడు సురేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతడి కుటుంబ సభ్యులు ఆ మాజీ ప్రజాప్రతినిధి ఇంట్లో పని చేసేవారనే విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. మాజీ ప్రజాప్రతినిధితో పాటు మరికొందరు అనుమానితుల పేర్లు విచారణలో పోలీసులకు చెప్పినట్టుగా హతుని సోదరుడు ఫోన్ సంభాషణ సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం సంచలనమైంది. విచారణలో వచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు సీసీ టీవీ ఫుటేజీలు, అనుమానితుల కాల్‌డేటా వివరాలు సేకరించి పరిశీలిస్తున్నారు. హత్య విషయం వెలుగులోకి వచ్చినప్పటి నుంచీ రామచంద్రపురం డీఎస్పీ బాలచంద్రారెడ్డి మండపేట వచ్చి అనుమానితులను విచారిస్తున్నారు. జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి కేసు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. శుక్రవారం వచ్చిన పోస్టుమార్టం నివేదికలో సురేష్ మెడ భాగంలో ఎముకలు విరిగి ఉన్నట్టు నిర్ధారణ అయింది. దీంతో అనుమానాస్పద మృతి కేసును పోలీసులు హత్య కేసుగా మార్చారు. పరారీలో ఉన్న అనుమానితులు దొరికితే మాజీ ప్రజాప్రతినిధి పాత్రపై స్పష్టత వస్తుందని పోలీసులు అంటున్నారు. ఈ కేసును అన్ని కోణాల్లోనూ సమగ్రంగా విచారణ చేస్తున్నామని మండపేట టౌన్ సీఐ పి. శివగణేష్ చెప్పారు. కేసులోని ప్రధాన నిందితులను ఆధారాలతో సహా పట్టుకుంటామని అన్నారు.

హనీకి పింఛన్ అందజేత

సాక్షి అమలాపురం: అరుదైన గాకర్స్ వ్యాధితో బాధ పడుతున్న చిన్నారి హనీకి వైద్య భరోసాతో పాటు పింఛన్ ఊతం కూడా లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నెలకు రూ.10 వేల చొప్పున పింఛన్ అందించాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు తొలి పింఛన్‌ను అల్లవరం మండలం నక్కా రామేశ్వరానికి చెందిన హనీ తల్లిదండ్రులు కొప్పాడి రాంబాబు, నాగలక్ష్మి దంపతులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా కలెక్టరేట్‌లో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంటి పెదపూడిలంక పర్యటన సందర్భంగా సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు హనీ వైద్యం కోసం గతంలో రూ.కోటి కేటాయించారని తెలిపారు. ఇప్పుడు పింఛన్ అందజేస్తున్నామని, హనీకి స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఉచిత ప్రవేశం కల్పించి, అన్నివిధాలా సహాయం అందిస్తానని కలెక్టర్ తెలిపారు.

ఆకుపచ్చ ధనం



రేష్మా రంజన్

పచ్చగా కళకళలాడటం అంటే ఏమిటో రేష్మా రంజన్‌కు తెలుసు. అందుకే తృప్తినివ్వని గవర్నమెంట్ ఉద్యోగాన్ని వదిలి మరీ ఇంట్లో ఉండిపోయింది. ఇంట్లో ఏం చేసింది? తనకిష్టమైన మొక్కలు పెంచింది. మట్టి, నీరు, కుండీ, ఆకు, ఎరువు... ఇవి ఎలా ఉపయోగిస్తే ఇంటి మొక్కలు అందంగా అద్భుతంగా ఉంటాయో బాగా తెలుసుకుంది. వాటినే వీడియో పాఠాలు చేసింది. 'ప్రకృతీస్ గార్డెన్' పేరుతో వందలాది వీడియోలు చేసింది. పది లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఏర్పడ్డారు. రేష్మా దిశా నిర్దేశంలో ఇళ్లల్లో మొక్కలు పెంచుతున్నారు. వారు హ్యాపీగా ఉన్నారు. దీనివల్ల వచ్చే ఆదాయంతో రేష్మా పచ్చగా ఉంది.

జార్ఖండ్‌లోని బొకారోలో రేష్మా రంజన్ ఇంటికి వెళితే చిన్న సైజు వనంలో అడుగు పెట్టినట్టు ఉంది. దాదాపు 2000 అందమైన, రకరకాల కుండీల్లో వందలాది రకాల మొక్కలు కనిపిస్తాయి. కొత్తిమీర, పాదీనాతో మొదలు ఆపిల్, అవకాడో వరకూ రేష్మా కుండీల్లో సృష్టించనిది అంటూ ఏదీ లేదు. ఒక కుండీలో ఉల్లిపాయలు పెరుగుతుంటాయి... మరో కుండీలో అనాసపళ్లు... ఇంకో కుండీలో చిలగడ దుంపలు, మరో కుండీలో నేతి బీరకాయలు... ఇక పూలైతే లెక్కే లేదు. వాటి మధ్య కూచుని వీడియోలు చేస్తుంటుంది రేష్మా. కేవలం తను పెంచి చూసిన మొక్కల గురించే ఆమె మాట్లాడుతుంది. ఆ అనుభవాల నుంచి వచ్చిన పాఠాలు కాబట్టే ఆమెకు పది లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఉన్నారు.

బాల్యం ముఖ్యం

బాల్యంలో ఏర్పరిచే మంచి ప్రభావాలు వారికి జీవితాంతం ఉంటాయి అనడానికి రేష్మ రంజన్ ఒక ఉదాహరణ. రేష్మాది బొకారో అయినా ఐదో క్లాస్ వరకూ బీహార్‌లోని పల్లెలో అమ్మమ్మ, తాతయ్య దగ్గర పెరిగింది. తాతయ్య ఇంట్లో విపరీతంగా చెట్లు. 'దారిన పసిబిడ్డను వదిలి వెళ్లిపోతే చూసినవారు ఎలా కలత చెందుతారో ఎవరైనా ఏదైనా మొక్కను పారేసి ఉంటే మా తాత అంత కలత చెందేవాడు' అంటుంది రేష్మా. అతడు ఎక్కడ ఏ మొక్క నిర్లక్ష్యంగా పడేసి ఉన్నా తెచ్చి ఇంట్లో దానికి ప్రాణం పోసేవాడు. రేష్మా మూడో క్లాసు పాసై నాలుక్కు వెళుతున్నప్పుడు మూడు మొక్కలు తెచ్చి వీటిని నువ్వే పెంచాలి అని చెప్పాడు తాతయ్య. 'అయితే నేను మరీ అతిగా పెంచి ఎక్కువ నీళ్ళు, ఎక్కువ ఎరువు వేసేసి వాటిని చంపేశాను' అని నవ్వుతుంది రేష్మా. ఆ గుణపాఠం నుంచి బాల్యంలోనే మొక్కలను ఎంత జాగ్రత్తగా చూసుకోవాలో నేర్చుకుంది. 'అదే మొక్కల మీద నా ప్రేమకు అంకురం' అంటుంది రేష్మా.

అందమైన ఇల్లు

మొక్కలు ఎలా అంటే అలా పెంచడం కాదు. వాటిని అందమైన కుండీల్లో అందమైన అరల మీద పెడితే వచ్చే అందాన్ని కూడా రేష్మా చెబుతుంది. సహజంగా ఎరువుల్ని, క్రిమి సంహారకాలను ఎలా తయారు చేసుకోవాలో చూపుతుంది. సేంద్రియ విధానాలు కూడా చూపుతుంది. ఇండోర్ ప్లాంట్స్ ఎలా శుభ్రం చేయాలి అనే ఆమె వీడియో ఇండోర్ ప్లాంట్స్ ఉన్నవారంతా చూడతగ్గది. 'వాల్ డెకరేషన్‌'గా గోడలకు కుండీలు బిగించి ఎలాంటి మొక్కలు పెంచాలో చూపుతుంది. ఇంకా ఆమె చెప్పే విషయాలు అనంతం.



ఉద్యోగంలో అసంతృప్తి

ఇంటర్ తర్వాత ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐ.సి.ఎ.ఆర్) నుంచి అగ్రికల్చర్ సైన్స్ డిగ్రీ చేసిన రేష్మా ఆ వెంటనే అగ్రికల్చర్ కోఆర్డినేటర్‌గా ప్రభుత్వ ఉద్యోగం పొందింది. '2015లో నాకు ఉద్యోగం వచ్చింది. నాకు ఇష్టమైన ఉద్యోగం అనుకున్నాను. నా పని రైతులకు వారి పంట పోషణలో సాయం చేయడం. కాని నా లాంటి చిన్న పిల్ల చెప్తే వినడం ఏమిటి అనుకునేవారో లేదా వారి సంప్రదాయ జ్ఞానం మీద విశ్వాసమో కాని నేను చెప్పే సూచనలు రైతులు వినేవారు కాదు. అంతేకాదు మట్టిని బట్టి, విత్తును బట్టి పంటలో మార్పు చేర్పులు చెప్తే లక్ష్యం చేసేవారు కాదు. ఆ అసంతృప్తి నాకు ఉండేది. మరో వైపు ఉద్యోగం వల్ల నేను స్వయంగా మొక్కలు పెంచలేకపోయేదాన్ని. అదే సమయంలో నా చదువును చూసి ఫ్రెండ్స్ ఫలానా మొక్కలు ఎవరు వేయాలి... ఫలానా తీగను ఎలా పెంచాలి... అని సలహా అడిగేవారు. ఈ అన్ని సమస్యలకు సమాధానంగా ఉద్యోగం మానేసి యూట్యూబ్ చానల్ మొదలెట్టాను' అంటుంది రేష్మా.

పదివేల మంది అనుకుంటే

'నేను మొక్కలు, తీగలు, పూల చెట్లు, పండ్ల చెట్లు, కూరగాయలు, ఇండోర్ ప్లాంట్లు... వీటన్నింటిని ఎలా పెంచాలో, కేర్ తీసుకోవాలో చెప్తే నాలాగే మొక్కలను ఇష్టపడే ఒక పదివేల మంది అయినా ఫాలో కాకపోతారా అనుకున్నాను. సహజ పద్ధతిలో గులాబీ పెంచడం ఎలా? అనేది నా మొదటి వీడియో. దానికి వచ్చిన ఆదరణ అంతా ఇంతా కాదు. పది వేల మంది అనుకుంటే రెండు మూడేళ్ల లోనే లక్ష మంది అయ్యారు. 2016 నుంచి నా పాఠాలు కొనసాగితే 2022 చివరకు పది లక్షల మంది సబ్‌స్క్రయిబర్స్ అయ్యారు. ప్రొడక్ట్ ప్రమోషన్స్ కోసం వచ్చే వారి వల్ల కాని, యూట్యూబ్–ఫేస్‌బుక్ పేజ్ వల్ల కాని నాకు నెలకు లక్ష నుంచి లక్షన్నర ఆదాయం వస్తోంది' అంటుంది రేష్మా.

ఒక పనిలో పూర్తిగా నైపుణ్యం ఉంటే ఆ పనిలో ఆనందం, ఆదాయం రెండూ పొంద వచ్చు. మీకు బాగా మొక్కలు పెంచడం వస్తే రేష్మాలా యూట్యూబ్ చానల్ నడపొచ్చు. బాగా మొక్కలు పెంచాలని ఉంటే ఆమె చానల్ ఫాలో కావచ్చు.

'అందరూ మొక్కలు పెంచితే ప్రపంచం పచ్చగా మారడానికి ఎక్కువ టైమ్ పట్టదు' అని రేష్మా చెప్పే మాట అందరూ వినాలి.

ముగ్గులకు ఆహ్వానం



9 చుక్కలు, నందు చుక్క చుట్టూ 1 వచ్చేవరకు



డి.భానుమతి
పాకాల టౌన్, తిరుపతి జిల్లా



సిరిపురం లక్ష్మీకళ
విద్యానగర్, నకిరేకల్



19 చుక్కలు ఎదురు చుక్క 1 వచ్చేవరకు

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com
(మీ ఊరుతోపాటు కాలనీ- వీధి పేరు కూడా రాయండి)

లాక్డౌన్ సమయంలో చాలా మంది క్రియేటివ్ ఆలోచనలతో వెలుగులోకి వచ్చారు. అదేవిధంగా బిజినెస్ రంగంలోనూ ఎదిగారు. అలాంటివారి జాబితాలో ముందుంటారు సీమా మక్వానా. ముంబైలో ఉంటున్న సీమ కరోనా సమయంలో ఇంట్లో వారి కోసం ముఖ్యంగా పిల్లలు ఇష్టపడేలా హెల్తీ బన్స్, ఫాస్ట్ ఫుడ్‌ను తయారు చేసేది. వాటి తయారీని పెంచి తమ అపార్ట్‌మెంట్ సభ్యులకు పంచేది. ఈ రోజు సీమా చేసే బన్స్‌కి ఫాస్ట్ ఫుడ్‌కి విదేశీల నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి. దీని వెనక ఉన్న ఆమె కృషి ఎంతో మందికి ప్రేరణనిస్తోంది.

హెల్తీ ఫాస్ట్ ఐడియా

పిల్లల నుండి పెద్దల వరకు ఫాస్ట్ ఫుడ్‌ని అందరూ ఇష్టపడతారు. అయితే, జంక్ ఫుడ్ అని వాటిని ఎక్కువగా తిననివ్వరు. కానీ, నోరూరించే ఆరోగ్యకరమైన ఫాస్ట్ ఫుడ్ అందుబాటులో ఉంటే ఎవరూ అడ్డుచెప్పరు. అదే థీమ్‌తో హెల్తీ ఫాస్ట్‌ఫుడ్‌ని అందిస్తుంది సీమా మక్వానా. దేశంలోనే మొదటిసారి హెల్తీ ఫాస్ట్ ఫుడ్ తయారీదారుగా పేరు తెచ్చుకుంది. ఈ తయారీ వెనక చోటు చేసుకున్న పరిణామాలను ఇలా వివరిస్తుంది.. "వంట చేయడం, కొత్త వంటకాలను ప్రయత్నించడం నా అభిరుచి. ప్రతి వంటకాన్ని ఆరోగ్యకరమైనదిగా మార్చడం అంటే నాకు చాలా ఇష్టం. ఇద్దరు పిల్లల తల్లిని అవడంతో వారికి రుచికరమైన ఆహారాన్ని ఎలా ఇవ్వాలా అనే ఆలోచిస్తుంటాను. తల్లిగా వారి ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో నాకు తెలుసు. అందుకే, నా పిల్లలు నేను తయారు చేసే ఫుడ్ తప్ప ఇతర జంక్ ఫుడ్‌ను ఎప్పుడూ ఇష్టపడరు.





సీమా మక్వానా

నమ్మకమైన బ్రాండ్

లాక్‌డౌన్ టైమ్ అందరిలోనూ సృజనాత్మక ఆలోచనలకు, పనులు చేయడానికి అవకాశం ఇచ్చింది. నేను మా అత్తమామలు, ఇరుగుపొరుగు వారితో సహా అందరికీ ఫుడ్ సిద్ధం చేసేదాన్ని. అప్పటి నుంచి నాలో నలుగురి కోసం నేనేమీ చేయలేకపోతున్నానే అనే గిల్టీ భావన దూరమైంది. ఆరోగ్యకరమైన, అందరికి మేలు చేసే ఫాస్ట్ ఫుడ్ తయారు చేస్తూ దీనినే ఒక నమ్మకమైన బ్రాండ్‌గా రూపొందించాలనుకున్నాను. ఆ ఆలోచన నుంచి వచ్చిందే బన్స్ అండ్ డెలుచాస్.

హెల్తీ కంపెనీ

దేశంలోనే మొదటిసారి చేతితో తయారుచేసే ఆరోగ్యకరమైన ఫాస్ట్ ఫుడ్ కంపెనీగా బన్స్ అండ్ డెలుచాస్ నిలిచింది. వంటల తయారీలో ఉపయోగించేవన్నీ సేంద్రియ పదార్థాలే. ఇండియన్, ఇటాలియన్, చైనీస్ గ్రేవీలతో స్టఫ్డ్ బన్స్ తయారు చేస్తాను. అన్నిరకాల రుచికరమైన కుల్చా ర్యాప్‌లు, స్నాక్ స్టఫ్డ్ వాఫ్లెస్‌ను కస్టమైజ్డ్ ఫింగర్ లీకీ డిప్స్‌తో సర్వ్ చేస్తాం. పండగల సమయాల్లో ఆరోగ్యకరమైన కొత్తతరహా వంటకాలను అందిస్తాం.

మంచి స్పందన

ప్రతి వ్యాపారంలో హెచ్చుతగ్గులు ఉంటాయి. కానీ వాటిని తెలివిగా ఎదుర్కోవడం ముఖ్యం. ఒక గృహిణిగా ఇటి పనులు, బాధ్యతలు నిర్వహించడం, ఆర్డర్లన్నింటిని పూర్తి చేయడం కష్టంగా ఉంటుంది. కానీ నా కల అన్నింటికన్నా బలమైనది. కష్టమర్ల నుండి వచ్చే మంచి స్పందన కూడా నేను మరింత కష్టపడేలా ప్రోత్సహిస్తుంది.

నా కూతురే గొప్ప ప్రేరణ

నేను చదివింది పదవ తరగతి వరకే. కానీ, నాకెప్పుడూ సొంతంగా ఏదైనా పని చేయాలని ఉండేది. నాకు ఇద్దరు పిల్లలు. అబ్బాయి స్పెషల్లీ ఛాలెంజ్డ్ కిడ్. నా ఫాస్ట్‌ఫుడ్ వెంచర్‌కి వెనకాల అతి పెద్ద ప్రేరణ నా కూతురు. తను నా వంటకాలకు ఫీడ్ బ్యాక్ ఇచ్చేది. సొంతంగా ఏదైనా ప్రారంభించమని ప్రోత్సహిస్తుంటుంది. చాలా కుటుంబాలు ప్రతిభావంతులైన మహిళలకు వారి అభిరుచిని కొనసాగించడానికి మద్దతు ఇవ్వవు. కానీ, నా కుటుంబం నుండి నాకు మద్దతు లభించింది. మా కుటుంబం నన్ను ఎంతగానో సపోర్ట్ చేస్తున్నప్పటికీ నేను తల్లిని. నా బిడ్డలను జాగ్రత్తగా చూసుకోవాలి. అలాగే గృహిణిగా కుటుంబ బాధ్యతలనూ చూసుకోవాలి. కొన్నేళ్ల క్రితం మా ఇంటికి దగ్గరలో ఉన్న ఒక బొమ్మల లైబ్రరీలో పనిచేశాను. కానీ, రోజూ బాబును వదిలి ఇంటి నుంచి బయటకు రావడం కష్టంగా ఉండటంతో ఆ పని మానేశాను. పిల్లలను చూసుకుంటూ వంట పనులు చేయడం ఇష్టంగా మారింది.



విదేశాలకు ఎగుమతి..

మా ఉత్పత్తుల కంపెనీ ప్రధాన లక్ష్యం ఫాస్ట్ ఫుడ్ స్టైల్‌లో ఫుడ్‌ని ఆరోగ్యకరంగా అందించడం. గోధుమ పిండితో బన్స్ తయారు చేస్తాను. అన్ని పదార్థాలు శాకాహారమే. బన్ లోపల కూరగాయలను, సాస్‌ను స్టఫ్‌గా ఉపయోగిస్తాను. దీని వల్ల ఎంత దూరం తీసుకువెళ్లినా బన్ లోపలి పదార్థం బయటకు రాదు. ఇదే మా సక్సెస్‌కు కారణం. విదేశాల నుంచి ఆర్డరు రావడానికి కూడా ఇదే కారణం. ప్రధాన ఆహార పరిశ్రమలో ప్రవేశించడానికి ఫ్రాంచైజ్ నెట్‌వర్క్‌ను ప్రారంభించబోతున్నాను. సొంతంగా వెబ్‌సైట్ ఉంది. దీని ద్వారానే కాకుండా ఫుడ్ డెలివరీ కంపెనీల నుంచి కూడా ఆర్డర్లు వస్తుంటాయి.

దేశం నలుమూలల నుంచే కాదు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా నుంచి ఆర్డర్లు వస్తుంటాయి. నా బంధువు కారణంగా వ్యాపారం విదేశాలకు చేరుకుంది. ఈ పనిని ప్రారంభించినప్పుడు ఆరు రోజుల తర్వాత నా తయారీ ప్యాకెట్‌ను కోరుకున్నవారికి పంపగలిగాను. పది రోజుల వరకు ఆహారం పాడవని విధంగా జాగ్రత్తలు తీసుకున్నాను. అక్కడి వారికి నా ఫుడ్ టేస్ట్ బాగా నచ్చింది. దీని తర్వాతే నా బన్స్ అండ్ డెలుచాస్‌ని విదేశీయులకూ అందివ్వగలను అనుకున్నాను. త్వరలో విదేశాలలోనూ నా వెంచర్‌ని ప్రారంభించాలనుకుంటున్నాను" అని ఆనందంగా వివరిస్తుంది సీమా.

ట్రెండ్

విడిచి వెళ్లినా.. చేయి వీడలేదు!

39 ఏళ్లు కలిసి మెలిసి జీవించిన భార్యను ఏ భర్త మర్చిపోగలడు? కోవిడ్ వల్ల ఆమె 2021లో మరణిస్తే చివరి చూపుకు కూడా అతను నోచుకోలేదు. కాని ఆమెను ప్రత్యక్షంగా రోజూ చూడదలిచాడు. అందుకే రెండున్నర లక్షలు ఖర్చుపెట్టి ముమ్మూర్తులా ఆమెనే పోలిన సిలికాన్ విగ్రహాన్ని ఇంట్లో ప్రతిష్టించగలిగాడు. బంధువులు, అయినవాళ్లు వారించినా వినలేదు. 'భార్యను ప్రేమించేవాడికే భార్య లేని లోటు తెలుస్తుంది' అంటున్నాడు కోల్‌కతాకు చెందిన తపస్ శాండిల్య. భార్య మీద ప్రేమకు ఇది కొలమానం కాకపోవచ్చుగాని భార్యను ఏ మాత్రం ప్రేమిస్తున్నాం అని భర్తలు ఆలోచనలో పడుతున్నారు ఈ విగ్రహం చూసి.

పాత సినిమాల్లో చనిపోయిన భార్య ఫొటో దగ్గర నిలబడి గుమ్మడి వంటి భర్తో, ఎస్.వి.రంగారావు వంటి భర్తో తమ ఉద్వేగాలు చెప్పుకోవడం చూసేవాళ్లం. అలాగే అంజలి, కన్నాంబ వంటి భార్యలు తమ భర్తల ఫొటోల ముందు నిలబడి 'చూశారా... మీ కొడుకు ఎంతటి ప్రయోజకుడయ్యాడో' అంటూ దుఃఖానంద అశ్రువులు జారవిడిచేవారు. కాని ఇటీవలి కాలంలో ఈ ఫొటోల స్థానంలో ఏకంగా సిలికాన్ శిల్పాలు ఇళ్లల్లో తమ జీవన భాగస్వాముల గుర్తుగా చేరుతున్నాయి. తమిళనాడు, ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాల్లో తల్లి కోసం తండ్రి శిల్పాన్ని చేయించిన పిల్లలు, తండ్రి కోసం తల్లి శిల్పాన్ని చేయించిన ఆత్మీయులు ఉన్నారు. ఇప్పుడు కోల్‌కటాకు చెందిన ఒక రిటైర్డ్ ఉద్యోగి తన భార్య మీద ప్రేమను శిల్ప ప్రతిష్ఠ ద్వారానే కొంతైనా చాటుకోగలను అంటున్నాడు.

చివరి చూపులకు నోచక

కోల్‌కటాకు చెందిన తపస్ శాండిల్య, అతని భార్య ఇంద్రాణి దాదాపు 40 ఏళ్లు వైవాహిక జీవితం గడిపారు. దురదృష్టవశాత్తు 2021 మేలో కోవిడ్ వల్ల ఇంద్రాణి మరణించింది. 'ఆ సమయంలో నేను ఐసొలేషన్‌లో ఉన్నాను. ఆస్పత్రిలో ఆమెను చూసుకోలేకపోయాను. అలాగే ఆమె అంతిమయాత్రకు కూడా లేను. నా బాధ వర్ణింపరానిది' అంటాడు శాండిల్య. ఆమె చనిపోయాక ఆ హటాత్‌లోటు అతణ్ణి నిలువనీయలేదు. 'పదేళ్ల క్రితం మయాపూర్ (బెంగాల్)లోని ఇస్కాన్ టెంపుల్‌ను మేము దర్శించాం. అక్కడ స్వామి వేదాంత నిలువెత్తు విగ్రహం ఉంది. అది నిజం మనిషిలా ఉంది. అప్పుడు నా భార్య ఇలాంటిది నాది కూడా ఉంటే ఎంత బాగుంటుంది అని మాట వరసకు అంది. ఆమె మరణించాక నాకు ఆ మాట, ఆ విగ్రహం గుర్తుకు వచ్చాయి. అలాంటి విగ్రహం తయారు చేసి ఇంట్లో ఉంచితేనే ఆమె లేని లోటు తీరుతుందని భావించాను' అన్నాడు తపస్.



భార్య ఇంద్రాణి సిలికాన్ విగ్రహంతో తపస్ శాండిల్య



శిల్పి అన్వేషణలో

అలా అనుకున్నాడుగాని అందుకు తగ్గ శిల్పి ఎవరు అనేది అతనికి తెలియలేదు. చివరకు మ్యూజియమ్‌లకు వ్యాక్స్, సిలికాన్ విగ్రహాలు తయారు చేసిచ్చే అదే రాష్ట్రానికి చెందిన సుబిమల్ దాస్ అనే శిల్పిని కలిశాడు. రెండున్నర లక్షల ఖర్చు అంచనాకొచ్చింది. 'ఇది చౌరస్తాలో పెట్టే విగ్రహం లాంటిది కాదని నాకు అనిపించింది. భావోద్వేగాలతో ఒక భర్త చేయించుకుంటున్న భార్య విగ్రహం. అది వీలైనంత జీవకళతో ఉండాలని ముఖంలో ఎక్స్‌ప్రెషన్ ఉండాలని నిశ్చయించుకున్నాను. మహనీయులంటే వారిని చూసి చూసి మనకు ముద్ర పడిపోయి ఉంటారు. వారి శిల్పం సులువు. కాని జీవితంలో ఎప్పుడూ చూడని ఒక సగటు ఇల్లాలి విగ్రహం తయారు చేయడం సవాలే' అన్నాడు సుబిమల్ దాస్. అయితే ముందు క్లే మోడల్ తయారు చేశాడు పోలికల కోసం. తపస్ కూడా ఈ క్లే మోడల్ తయారయ్యేంత వరకు సుబిమల్ దాస్ తోడు ఉన్నాడు. అది సంతృప్తిగా ఉందని అనిపించాక ఫైబర్ మోడల్ దానికి సిలికాన్ కాస్టింగ్ పూర్తయ్యాయి. 'కేవలం జుట్టు ఇమడ్చడానికే 30 రోజులు పట్టింది' అంటాడు తపస్ శాండిల్య. 'నా భార్య నా కొడుకు పెళ్లిలో కట్టుకున్న వస్త్రాలు విగ్రహానికి తొడిగాను. హాల్లో సోఫాలో ఆమె కూచుని ఉంటే అచ్చు నా భార్య ఇంట్లో ఉన్నట్టే అనిపిస్తోంది' అని సంతృప్తిపడుతున్నాడు.

చనిపోయిన మనిషి రూపాన్ని అలా ఇంట్లో పెట్టడం మంచిది కాదని బంధువులు వారించినా తపస్ వినలేదు. గిట్టని వాళ్లు ప్రచారం కోసం ఇదంతా చేస్తున్నాడని విమర్శించారు కూడా.

ఆ సంగతి అలా ఉంచితే భార్య పట్ల బాధ్యతగా ఉండే భర్తలు ఆ బాధ్యతే ప్రేమ అనుకుంటూ ఉంటారు. తమని ప్రేమించడం భార్యల వంతు అన్నట్టుగా ఉంటుంది వీరి వైఖరి. అనుకోని ఎడబాటు వస్తే ఆమెను చూసుకోవాల్సినంత ప్రేమగా చూసుకోలేదు అని వగచే బదులు ఉన్నప్పుడే దాంపత్య బంధాన్ని ప్రేమ బంధంగా మలుచుకోవడంలో శ్రద్ధ చూపడం మేలు. ఏ భార్యాభర్తలైనా కలకాలం ప్రేమగా బతకడమే కావాల్సింది.